సమస్యల పరిష్కారానికి కృషి



బన్సీలాల్‌పేట్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ కె. హేమలత అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు బస్తీల్లో మంగళవారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన హామీలను సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. బన్సీలాల్‌పేట్ స్వామి వివేకానంద సంఘం సమీపంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సహకారంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దామన్నారు. నాయకులు శ్రీకాంత్, ఫయూమ్, వెంకటేశ్ యాదవ్, అచ్చా, శివ పాల్గొన్నారు.

బీసీలకు మూడు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలి



ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు మూడు స్థానాలు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ.. జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ రెండు, బీఆర్ఎస్ ఒకటి మొత్తం 3 స్థానాలను బీసీలకు కేటాయించి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు కూర శ్రీనివాస్, గోదా రవీందర్ పాల్గొన్నారు.

తార్నాక ఎర్రకుంట చెరువు అభివృద్ధికి చర్యలు



చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

లాలాపేట: గొలుసు కట్టు చెరువుల పునరుద్ధరణలో భాగంగా తార్నాక ఎర్రకుంట చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీ సాయిరాం అన్నారు. తార్నాక ఎర్రకుంట చెరువును మంగళవారం సందర్శించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో చెరువు పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇప్పటికే అన్యాక్రాంతమైన చెరువు భూములపై ఆరా తీశారు. కార్యక్రమంలో మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలన అందరి బాధ్యత

చిలకలగూడ: వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. చిలకలగూడ ఠాణా ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దివ్యదిశ సంస్థ రూపొందించిన వెట్టిచాకిరీ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెట్టి చాకిరీ నిర్మూలనకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. మానవ అక్రమ రవాణ, వెట్టిచాకిరీ, బాల కార్మికులు తదితర అంశాలపై ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేస్తుందన్నారు. అడ్మిన్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, దివ్యదిశ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న ఇందిరానగర్ నాలా పనులు

నత్తనడకన..!

ఇందిరానగర్‌లో రూ.80 లక్షలతో నాలా పునఃనిర్మాణం

- నెలలుగా కొనసా..గుతున్న పనులు
- రాకపోకలకు కాలనీవాసుల ఇబ్బందులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో చేపట్టిన వరదనీటి కాల్వ (నాలా) పునఃనిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ.80 లక్షల అంచనా వ్యయంతో కాలనీ మధ్య నుంచి రహదారిని తవ్వి నిర్మాణం ప్రారంభించారు. అయితే నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తికాకపోవడంతో కాలనీవాసులు ప్రధానరహదారికి వెళ్లేందుకు చేపట్టిన తవ్వకాలు అడ్డుగోడలుగా మారుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

నాలా నిర్మాణం సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వారం క్రితం నిర్మాణం కోసం తీసిన గుంతలో పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు పనుల వేగవంతంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఇందిరానగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మరోవైపు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కూడా సరిగా పాటించడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. ఇదిలాఉండగా నాలా పనుల్లో జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమేనని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అంగీకరించారు. జీహెచ్ఎంసీ అధికారుల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వల్లే పనులు వేగవంతంగా జరగక పోవడం కారణమని ఆమె పేర్కొంటున్నారు. నాణత్యా ప్రమాణాల విషయంలో ఉపేక్షించేది లేదని, అధికారులతో మాట్లాడి పనులు తర్వగా పూర్తయ్యేలా చూస్తానని హామీనిచ్చారు.

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు



లాలాపేట: మహాశివరాత్రికి వేడుకలకు తార్నాక మున్సిపల్ డివిజన్ వ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. ప్రధానంగా లాలాపేటలో శివాంజనేయ, ఇందిరానగర్‌లోని రామలింగేశ్వర్, తార్నాక హనుమాన్‌నగర్‌లోని శివాంజనేయ ఆలయాలను అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలతో శివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ పండితులు తెలియజేస్తున్నారు. శివపార్వతుల కల్యాణం అనంతరం అన్నదానాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యుడు సత్యానారాయణ పేర్కొన్నారు.

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో..

బన్సీలాల్‌పేట్: డివిజన్‌లోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. బన్సీలాల్‌పేట్, ఐడీహెచ్ కాలనీ, హమాల్‌బస్తీ, మోండా మార్కెట్, బోయిగూడ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాలతో పాటు రాణిగంజ్‌లోని సుప్రసిద్ధమైన లాలాగుడిని రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. హమాల్‌బస్తీలోని శివాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇందిరానగర్‌లో లింగాకారంలో శివాలయం

చిలకలగూడలో..

చిలకలగూడ: చిలకలగూడలోని శైవక్షేత్రాలను పూలు, విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం లింగోద్భవం, శివపార్వతుల కల్యాణంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా తెలిపారు. దాతర కాంపౌండ్ శివశంకర మందిరం, దూద్‌బావి కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అకీషా ఫౌండేషన్ చైర్మన్ బండపల్లి సతీశ్ నేతృత్వంలో చిలకలగూడ జీహెచ్ఎంసీ మున్సిపల్ మైదానంలో రుద్రాభిషేకం, మహాజాగరణ నిర్వహించనున్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి



విద్యార్థులతో ఏసీపీ, ఇతరులు

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో పదో తరగతి విద్యార్థులకు 'ఒత్తిడిని తట్టుకుని పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి' అనే అంశంపై మంగళవారం సెమినార్ ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. టీవీ, ఇంటర్నెట్, మొబైల్స్‌తో సోషల్ మీడియాలో చాలా సమయం వృథా చేస్తున్నారని దానివల్ల విలువైన కెరీర్‌ను నష్టపోతున్నారన్నారు. ఇప్పుడు కష్టపడి చదివితేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ గంపా నాగేశ్వరరావు, టీఆర్ఎస్ఎంసీ అధ్యక్షుడు మహేశ్వరరావు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఒత్తిడిని ఎలా జయించాలి అనేదానిపై ఉపన్యాసం అందించారు. కార్యక్రమంలో మెరిటో జూనియర్ కాలేజ్ డైరెక్టర్ అర్జున్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్

సనత్‌నగర్: బేగంపేటలో రహదారికి అడ్డంకిగా రెండు భారీ ఫెల్టోఫోరమ్ చెట్లు ఉన్నాయి. వాటి ద్వారా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు వాటిని కొట్టివేయకుండా ట్రాన్స్‌ప్లాంట్ (వేరే చోట నాటడం) చేయడం ద్వారా పునరుజ్జీవం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వేటా ఫౌండేషన్ సహకారంతో 15–20 ఏళ్ల వయసున్న భారీ చెట్లను జాగ్రత్తగా తొలగించే ఏర్పాట్లు చేశారు. మయూరిమార్గ్‌లోని రెండు చెట్ల కొమ్మలతో పాటు కాండంతో సహా ప్రధాన భాగాన్ని క్రేన్ సహాయంతో వేర్లతో సహా సోమవారం జాగ్రత్తగా తొలగించారు. ఈ చెట్లను సమీపంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో తిరిగి నాటారు.



చెట్టు ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ట్రాఫిక్ పోలీసులు

రంజాన్ మాసానికి ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత

లాలాపేట: రంజాన్ మాసం నేపథ్యంలో మసీదుల వద్ద ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, ట్రాఫిక్ పోలీసు విభాగాల అధికారులతో పాటు మసీద్ కమిటీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఇఫ్తార్ అనంతరం వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మసీదులకు వెళ్లే రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ జాం తదితర సమస్యలపై సత్వరమే స్పందించాలని సూచించారు. సమావేశంలో మోతే శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ వేణు, శానిటేషన్ డీఈ వెంకటేశ్, ట్రాఫిక్ ఎస్సై నిరంజన్, ఆయా విభాగాల అధికారులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మహంకాళి ఏసీపీగా బాధ్యతల స్వీకరణ



ఏసీపీ సైదయ్య

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ సీసీఆర్‌బీగా పనిచేస్తున్న సైదయ్య మహంకాళి డివిజన్ ఏసీపీగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏసీపీ సర్దార్‌సింగ్‌ను సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మంగళవారం సాయంత్రం సైదయ్య బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహబూబ్ కాలేజ్–ఎస్వీఐటీల మధ్య జరుగుతున్న వివాదంలో ఓ వర్గానికి మద్దతు ఇచ్చారనే ఆరోపణలతోనే ఏసీపీ సర్దార్‌సింగ్‌ను అటాచ్ చేసినట్లు తెలిసింది.

యువత మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలి

బన్సీలాల్‌పేట్: యువత మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ. కరీం అన్నారు. సికింద్రాబాద్ బోట్స్ క్లబ్ యూత్ హాస్టల్ ఆవరణలో యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మానసిక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం ఉంటేనే యువత ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. యువత తమ లోపాలను విమర్శలను సానుకూలంగా తీసుకున్నప్పుడే తమ వ్యక్తిత్వాన్ని విజయం వైపు మలుచుకోగలరని సూచించారు. అనంతరం యువత మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ లోగోను ఆవిష్కరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు హెల్ప్‌లైన్ నంబర్ 9440488571, 040–35717915 లకు కాల్ చేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూగుప్తా, ప్రోగ్రాం అధికారి యాదగిరితో పాటు తమిళనాడు యువకులు పాల్గొన్నారు.



యువకులతో డాక్టర్ కరీం

నిధులు మంజూరు చేయాలి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె తాగునీరు, సీవరేజీ లైన్ల నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలు కూడా అందించారు. అనంతరం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావుతో సమావేశమై డివిజన్‌లోని నెలకొన్న పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల విషయమై చర్చించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, రాజ సుందర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్కూటీలు పంపిణీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థినులకు ఎలక్ట్రికల్ స్కూటీలను తక్షణమే పంపిణీ చేయాలని తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకురాలు డా.సత్యవతి మంగళవారం డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రికల్ స్కూటీలు అందిస్తామని ఎంపీ ప్రియంక గాంధీ ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్కూటీల పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థినులు పోస్టు కార్డుల ఉద్యమాన్ని నడుపుతుంటే పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. వారం రోజుల్లో స్కూటీల పథకాన్ని అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బౌద్ధనగర్: మహా శివరాత్రిని పురస్కరించుకుని అంబర్‌నగర్‌లోని మార్కండేయ ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదానం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎడుగని లత దేవేందర్, రాంచందర్ కుటుంబ సభ్యులతో పాటు వరప్రసాద్, స్వర్గం బాబు, బొమ్మ నరేందర్, శశికళ, మారుతి, శేఖర్, గుంటకు రూప, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూబోయిగూడలో 'స్వచ్ఛభారత్'

బన్సీలాల్‌పేట్: న్యూబోయిగూడలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ ఫిలోమినా విద్యార్థులతో పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ దానాగౌడ్, సెయింట్ ఫిలోమినా స్కూల్ హెచ్ఎం భాస్కర్ రెడ్డి, ఎస్ఎఫ్ఏ గోవింద్ రాజు, కృష్ణ, నర్సింగ్‌రావు, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్, హెచ్ఎం మాట్లాడుతూ.. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, వ్యర్థాలు వేయడం వల్ల పరిసరాలు దుర్వాసన కావడంతో పాటు రోగాలు ప్రబలి ప్రజలు అనారోగ్యాలపాలవుతారన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు పరిసరాల శుభ్రత పర్యావరణ పరిరక్షణపై అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఖాళీస్థలాల్లో చెత్తను తొలగించాలి

అడ్డగుట్ట: ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తను తొలగించాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత కోరారు. ఈమేరకు నాయకులతో కలిసి సికింద్రాబాద్ సర్కిల్ డీసీ సుభాష్‌రావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తుకారాంగేట్ నందనార్‌నగర్‌లోని సమోసా గార్డెన్ సమీపంలో గల ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోయిందన్నారు. సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు అక్కడ మంటలు చెలరేగాయని, అయితే ఖాళీ స్థలం కావడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. ఏదైనా ప్రమాదాలు జరగకముందే ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సేవాదళ్ సికింద్రాబాద్ వైస్ ప్రెసిడెంట్ రామలీల, మేరీ, రవి, వరలక్ష్మి ఉన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

లాలాపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి బక్క ఏలియా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ప్రసన్న బోల్డ్ పిలుపునిచ్చారు. స్థానిక ఫెయిత్ మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 8న ఎన్‌సీసీ ఆధ్వర్యంలో తలపెట్టిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా అందరూ సమన్వయంతో పని చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

14.5 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి



పోలీసుల అదుపులో గంజాయి పెడ్లర్లు

రాంగోపాల్‌పేట్: టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి కేసులో 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..మారేడుపల్లికి చెందిన రౌడీషీటర్లు టమాట సంజ్ (24), టమాటా పవన్ (26), బాలాజీనగర్‌కు చెందిన జొమాటో డెలివరీ బాయ్ జ్వాలా దీపాన్షు((22), మెడిప్లస్‌లో పనిచేసే శామీర్‌పేట్‌కు చెందిన డప్పు కిరణ్‌కుమార్(19), శామీర్‌పేట్‌కు చెందిన కారు డ్రైవర్ కొగురు నవీన్‌కుమార్(22), లోతుకుంటకు చెందిన ముత్తు కృష్ణ రోహిత్‌కుమార్ (26), బాలాజీనగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ మార్పు జోయల్ వంషిక (22) స్నేహితులు. వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సంజయ్, పవన్ ఇద్దరూ కలిసి అరకు నుంచి గంజాయిను తెప్పించి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని పథకం వేశారు. ఈ మేరకు గంజాయి తెప్పించి మిగితా స్నేహితుల సహాయంతో అవసరం ఉన్న వారికి విక్రయిస్తున్నారు. మంగళవారం 8 కిలోల గంజాయిని తెప్పించి రాణిగంజ్‌లోని జేమ్స్‌స్ట్రీట్ రైల్వేస్టేషన్ పార్కింగ్ దగ్గర విక్రయించేందుకు వెళ్లారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సైలు శ్రీనివాసులు దాసు, జ్ఞానదీప్, రాఘవేందర్‌రెడ్డి, రాంగోపాల్‌పేట్ ఎస్సై నర్సింగ్‌రావుతో కలిసి నిందితులతో పాటు గంజాయి సేవించే నేరెడ్‌మెట్‌కు చెందిన తోట హర్షవర్ధన్ (27), తుకారంగేట్‌కు చెందిన దాసరి దీక్షిత్ సాయికుమార్ (23)ను కూడా అరెస్టు చేశారు. రాంగోపాల్‌పేట్ పోలీసులు నిందితుల నుంచి రూ.2.4 లక్షల విలువైన 8 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. కాగా గంజాయి సరఫరా చేసే అరకుకు చెందిన సుబ్బారావు పరారీలో ఉన్నారు.

ఆర్యనగర్‌లో 6.5 కిలోల గంజాయి..

అడ్డగుట్ట: ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరు పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్యనగర్‌లో మంగళవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన రాఘవేందర్‌రెడ్డికి ఒడిస్సాలోని డ్రగ్ పెడ్లర్లతో పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. అందులో భాగంగా రాఘవేందర్ మల్లాపూర్‌కు చెందిన పడాల ధనుష్ (23), మౌలాలికి చెందిన పిట్ల వంశీ (25)లతో కలిసి ఒడిస్సాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తిరిగి హైదరాబాద్‌కు వస్తున్నారు. మంగళవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకునే సమయంలో లాలాపేటలోని ఆర్యనగర్ పట్టాల వద్ద సిగ్నల్ పడడంతో రైలు ఆగింది. ఈ క్రమంలో ముగ్గురు పెడ్లర్లు రైలు దిగి శాంతినగర్ బ్లూమూన్ హోటల్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. అప్పటికే అందిన సమాచారం మేరకు లాలాగూడ, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ధనుష్, వంశీని అదుపులోకి తీసుకుని 6.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, మరో పెడ్లర్ రాఘవేందర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.